క్లుప్తంగా

ఆలయంలో ప్రత్యేక పూజలు



అయిజ: పట్టణ సమీపంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతి సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ గాయత్రి, విశ్వకర్మ మూలవిరాట్ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. విశ్వకర్మ పతాకా విష్కరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసి పోయాయి. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

హైదరాబాద్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు



గట్టు: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఆదివారం ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్‌కు తరలి వెళ్లారు. తుక్కుగూడలో నిర్వహించే కాంగ్రెస్ బహిరంగ సభకు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున వెళ్లారు. సర్పంచు ధనలక్ష్మి, మండల అధ్యక్షుడు మహబూబ్‌పాషా, నాయకులు, కార్యకర్తలు వెళ్లారు.
ధరూరు: హైదరాబాద్‌లోని తుక్కుగూడలో జరుగుతున్న సీడబ్ల్యూసీ సభకు మండలం నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ సరిత ఆధ్వర్యంలో మండలం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు వెళ్లారు.
ఎర్రవల్లిచౌరస్తా: హైదరాబాద్‌లోని తుక్కుగూడలో జరిగే కాంగ్రెస్ విజయభేరి సభకు ఇటిక్యాల మండలం కాంగ్రెస్ నాయకులు తరలి వెళ్లారు. అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.

ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు

ఉండవెల్లి: మండల కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పుట్టిన రోజు బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు పిడుగు వెంకటేష్, బాణాసంచ కాల్చి మిఠాయి తినిపించుకున్నారు.

దేశ గౌరవం కాపాడటం అందరి బాధ్యత



గద్వాల: దేశ గౌరవం, స్వేచ్ఛను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పట్టణ బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు జయశ్రీ అన్నారు. ఆజాదికా అమృత్ మహోత్సవ్ ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం 31, 32, 36 వార్డుల్లో పార్టీ నాయకులు 'మేరా మిట్టి.. మేరా దేశ్' (నామట్టి...నాదేశం) కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా వార్డుల బీజేపీ ఇన్‌చార్జ్‌లు తుమ్మల నర్సింహ, రామ్‌జీ, రజక నర్సింహ పాల్గొన్నారు.

20న మండల సర్వసభ్య సమావేశం

ధరూరు: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 20న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎండీ జబ్బార్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో విధిగా హాజరు కావాలని కోరారు.

పునః ప్రారంభించండి

- 1993లో ప్రారంభం.. 2006లో మూత
- ఏడేళ్ల పాటు జోరుగా క్రయ, విక్రయాలు
- కమీషన్ మర్చంట్ మళ్లీ తెరవాలని రైతుల వేడుకోలు



వ్యవసాయ మార్కెట్ సబ్‌యార్డ్



శిథిలమైన కమీషన్ మర్చంట్ భవనాలు

అయిజ: ప్రభుత్వం 1993లో మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ సబ్ యార్డ్‌లో కమీషన్ మర్చంట్‌ను ప్రారంభించింది. మండలంలోని రైతులేగాక చుట్టు పక్కల మండలాల నుంచి రైతులు కమీషన్ మర్చంట్‌కు పంటలు తీసుకొచ్చి విక్రయించేవారు. ప్రారంభించిన మూడేళ్లు కమీషన్ మర్చంట్ ప్రక్రియ మూడుపూవ్వులు, ఆరు కాయలుగా వెలుగొందింది. అటు రైతులకు ఇటు వ్యాపారులకు సౌకర్యంగా ఉండేది. కాలక్రమేనా కమిషన్ మర్చంట్ నిర్వహణ సన్నగిల్లింది. అనంతరం కమిషన్ మర్చంట్‌కు కావలసిన ఏర్పాట్లను ప్రభుత్వం కల్పించలేదు. కనీస వసతులు లేక పోవడంతో అటు రైతులు, ఇటు వ్యాపారులు అనేక ఇబ్బందులు పడ్డారు. కమీషన్ మర్చంట్ యజమానులకు సమస్యలు ఎదురవుతున్నా కమీషన్ మర్చంట్‌ను కొన్నేళ్ల పాటు కొనసాగించారు. కాల క్రమేనా ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో కమీషన్ మర్చంట్ యజమానులు తప్పుకున్నారు. ఇప్పటి వరకు అటు అధికారులు కానీ, ఇటు ప్రజా పతినిధులు గానీ పట్టించుకున్న పాపాన పోలేదు.

వ్యయ ప్రయాసాలతో ధాన్యం తరలింపు..

మండలంలో మొత్తం 68,673 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. సాగుచేస్తున్న భూమి 57,637 ఎకరాలు, 6,683 ఎకరాల భూమి సాగుకు ప్రతికూలమైనది. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆర్డీఎస్ ఆయకట్టులో 7,500 ఎకరాల భూమిలో రైతులు వరి సాగుచేస్తున్నారు. మిగితా గ్రామాల్లో బోరుబావుల నుంచి లభ్యమయ్యే నీటి ఆధారంగా దాదాపు 20 వేల ఎకరాల్లో వాణిజ్య పంటలు పండిస్తున్నారు. మిగితా 30 వేల ఎకరాల్లో వేరుశనుగ, పప్పుశనగ, కంది మొదలగు పంటలు పండిస్తున్నారు. కొన్ని రకాల పంటలను ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా పంటలను కొనుగోలు చేస్తున్నా మిగిలిన పంటలను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్ముకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పంటలను పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలోని రాయచూర్ జిల్లాలోని మార్కెట్ యార్డ్‌లో విక్రయిస్తున్నారు. వేరుశనగ, పత్తి పంటలను గద్వాల జిల్లా కేంద్రంలో విక్రయిస్తున్నారు. కొంతకాలం ఆంధ్ర పదేశ్‌లోని ఎమ్మిగనూర్ మార్కెట్‌కు రైతులు వివిధ రకాల పంటలను తరలించి విక్రయించారు. మండల కేంద్రానికి రాయచూర్ మార్కెట్ యార్డ్ 50 కిలోమీటర్లు, గద్వాల మార్కెట్ యార్డ్ 30 కిలోమీటర్ల దూరం ఉన్నాయి. కొన్ని గ్రామాలకు ఈ దూరం రెట్టింపవుతుంది. అన్నదాతల కష్టాలను దృష్టిలో ఉంచుకొని కమీషన్ మర్చంట్‌ను పునర్ ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అవస్థలు పడుతున్నాం..



మండలంలో కమీషన్ మర్చంట్ లేనందున అనేక ఇబ్బందులకు గురవుతున్నాం. గతంలో కొన్నేళ్లు అయిజలోని మార్కెట్ సబ్ యార్డ్‌లో కమీషన్ మర్చంట్ నిర్వహించారు. అనంతరం నిర్వాహణకు నోచుకోక కమీషన్ మర్చంట్ మూతపడింది. రైతులు గద్వాల్‌కు, రాయచూరుకు పోవాలంటే చాలా ఖర్చవుతోంది. కమిషన్ మర్చంట్‌ను అయిజలో పునర్ ప్రారంభిస్తే బాగుంటది.
– వీరేష్‌రెడ్డి, మూగోనిపల్లి

సౌకర్యం కల్పించాలి..



జిల్లాలో అయిజ పెద్ద మండలం. ఈ మండలానికి వ్యవసాయ కమీషన్ మర్చంట్ లేక పోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం మార్కెట్ సబ్‌యార్డ్‌లో కమీషన్ మర్చంట్‌ను ఏర్పాటు చేసి రైతుల పంటలు కొనుగోలు చేసేవిధంగా చర్యలు చేపట్టాలి.
– శివకుమార్, తొత్తినోనిదొడ్డి

నివేదిక పంపుతాం..



ఒకప్పుడు అయిజ మార్కెట్ సబ్‌యార్డ్‌లో కమీషన్ మర్చంట్‌లు నిర్వహించారు. చాలా కాలం నుంచి నిర్వాహణ లేకపోవడంతో కమీషన్ మర్చంట్‌ను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.
– శంకర్‌లాల్, మండల వ్యవసాయ అధికారి



ఎస్పీ కార్యాలయంలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎస్పీ సృజన

ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం

గద్వాల క్రైం: ఎస్పీ కార్యాలయంలో ఆదివారం తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ సృజన జాతీయ జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ నిజాం ఆధీనంలో ఉన్న హైదరాబాద్‌కు 1948 సెప్టెంబర్ 17న స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ప్రభుత్వం జాతీయ సమైక్యతా వజ్రోత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిందన్నారు. జిల్లా రవాణశాఖ, అగ్నిపమాక, జిల్లా ఆరోగ్యశాఖ, ఎక్సైజ్, ఆర్టీసీ కార్యాలయాల్లో జెండా ఆవిష్కరణ చేపట్టారు. కార్యాక్రమంలో ఏఎస్పీ, డీఎస్పీ ఉన్నారు.

బీఎస్పీ జెండా పండుగ

అలంపూర్: మండల కేంద్ర, అలంపూర్ చౌరస్తాలోని బీఎస్పీ నాయకులు తెలంగాణ పునర్విమోచన దినోత్సవం నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రంలో బీఎస్పీ నాయకులు బహుజన జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. అలంపూర్ చౌరస్తాలో బీఎస్పీ కార్యాలయం ముందు జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు ప్రభుదాసు, సుమలత, ప్రభాకర్, తక్కశిల, శంకర్ గౌడు, ముప్పరపు ఎల్లయ్య పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ జెండావిష్కరణ



రాజోళిలో జాతీయ సమైక్యతా దినోత్సవంలో పాల్గొన్న తహసీల్దార్

గద్వాల అర్బన్: సెప్టెంబర్ 17ను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో జాతీయ జెండా రేపరేపలాడింది. వివిధ పార్టీల ఆధ్వర్యంలో జెండాఆవిష్కరించారు.

టీఆర్ఎస్ ఆధ్వర్యంలో..

ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ సరోజమ్మ, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, నాయకులు ఉన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

తెలంగాణ విమోచన దినోత్సవంగా బీజేపీ నిర్వహించింది. ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

కాంగ్రెస్ ఆధ్వర్యంలో తెలంగాణ విలీన దినోత్సవం నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్ క్యాంపు కార్యాలయం వద్ద జెండాను ఎగిరేశారు.

ఎంఐఎం ఆధ్వర్యంలో..

ఎంఐఎం పార్టీ జిల్లా అధ్యక్షుడు మున్నాబాషా ఆధ్వర్యంలో తిరంగ ర్యాలీని నిర్వహించారు. సందర్భంగా మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కేటీదొడ్డి: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సరితరాణి, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మనోరమ, పోలీస్ స్టేషన్‌లో ఎస్ ఐ వెంకటేషలు జాతీయ జెండా ఎగురవేశారు.

మల్దకల్: ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఎంపీపీ రాజారెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డాక్టర్ స్వరూపారాణిలు జెండాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, తహసీల్దార్ హరికృష్ణ, ఎంపీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ పెద్ద నర్సన్న, సూర్యప్రకాష్‌రెడ్డి ఉన్నారు.

అయిజ: తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ షహిదాబేగం, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ నాగేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్లు జాతీయ జెండాను ఎగురవేశారు.

గట్టు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ విజయ్‌కుమార్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ధనుంజయ్‌లు జాతీయ పతకాలను ఆవిష్కరించారు.

శాంతినగర్: మండల పరిషత్ అధ్యక్షురాలు రజిత జాతీయ జెండా ఆవిష్కరించారు. ఎంపీడీఓ రవీంద్ర, తహసీల్దార్ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

ధరూరు: ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నజీమున్నీసా బేగం, జెడ్పీటీసీ పద్మా వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రాజోళి: ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రేణుక, నతానియేల్, మాజీ సర్పంచ్ శ్రీరామ్ రెడ్డి, గంగిరెడ్డి పాల్గొన్నారు.

పదో పటాలంలో..

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి పదో పటాలంలో తెలంగాణ సమైక్యతా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇన్‌చార్జ్ కమాండెంట్ సాంబశివరావు జాతీయ జెండాను ఎగుర వేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ అనిల్‌కుమార్, ఆర్ఐలు రాజారావు, గోపాల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇటిక్యాల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ స్నేహ, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సింగిల్ విండో కార్యాలయంలో అధ్యక్షుడు రంగారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

మానవపాడు: ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్‌రెడ్డి, తహసీల్దార్ జుబెర్ మొహిరుద్దీన్, ఎంపీడీఓ రమణరావు, ఆర్ఐ రజనీకాంత్‌రెడ్డి, సినియర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.



ఎర్రవల్లి పదో బెటాలియన్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జ్ కమాండెంట్



మల్దకల్ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జెండాకు వందనం చేస్తున్న ఎంపీపీ రాజారెడ్డి



శాంతినగర్‌లో జాతీయ జెండాకు సెల్యూట్



అలంపూర్‌లో గాంధీ విగ్రహం వద్ద..



అయిజ వేడుకల్లో తహసీల్దార్ షహిదాబేగం



జిల్లా కేంద్రంలో తిరంగ ర్యాలీని చేపడుతున్న ఎంఐఎం నాయకులు

ఘనంగా విశ్వకర్మ జయంతి



గట్టులో విశ్వకర్మ జయంతి ఊరేగింపు

గట్టు: విశ్వకర్మ జయంతి వేడుకలను ఆదివారం గట్టులో ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన విశ్వబ్రహ్మణ సోదరులు గట్టుకు చేరుకుని విశ్వకర్మ జయంతి చేశారు. గట్టులోని కాళికాదేవి ఆలయం నుంచి విశ్వకర్మ చిత్ర పటాన్ని ఊరేగించి బస్టాండ్ వరకు తీసుకెళ్లారు. కాళికాదేవి ఆలయం దగ్గర విశ్వకర్మ జెండాను విశ్వబ్రహ్మణ మండల అధ్యక్షుడు రాఘవేంద్రాచారి ఆవిష్కరించారు. బస్టాండ్ ఆవరణలో పీఎం మోడీ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్ ఆచారి, ఉపాధ్యక్షుడు తిమ్మప్పాచారి, వీరేష్‌చారి, నరేందరాచారి, రమేష్‌చారి, విశ్వకర్మ సోదరులు శేఖరప్ప, మోనప్ప, జయనర్సింహులు, వెంకటేష్, కాళప్ప, వీరేష్, వీరన్న, బ్రహ్మయ్య, నర్సింహాచారి, నరేందరాచారి, జనార్ధన్, వీరేష్, మోనయ్య, ధనుంజయ పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



గద్వాలలో దీక్ష చేపట్టిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

గద్వాల: జిల్లాలోని విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణమే క్రమబద్ధీకరించాలని చేపట్టిన రిలే దీక్షలు 14వ రోజుకు చేరాయి. ఆదివారం దీక్ష శిబిరంలో ఉద్యోగులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు హుసేనప్ప, గోపాల్ మాట్లాడారు. కేజీబీవీ సీఆర్‌టీలు, సీఆర్పీలు, డీఎల్ఎంటీ, సీసీఓ, పీటీఐ, యూఆర్ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలన్నారు.సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

నియమాలు పాటిస్తే నిర్విఘ్నం!

- వినాయక మండపాల ఏర్పాటుతో అప్రమత్తత అవసరం
- పోలీసులు, అధికారుల సూచనలు పాటించాలి



గద్వాల: ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న వినాయక చవితి రానే వచ్చింది. కుల, మతాలకతీతంగా వాడవాడలా వినాయక విగ్రహాలను భక్తి శ్రద్ధలతో నెలకొల్పే సమయం అసన్నమైంది. గణేష్ నవరాత్రి వేడుకలు 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. విగ్రహ మండపాల ఏర్పాటు, పూజలు, ఊరేగింపు, నిమజ్జనం ఇలా ప్రతి సందర్భంలో చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే నవరాత్రులు విజయవంతమవుతాయి.

అధిక శబ్దాలు వద్దు..

పూజలు నిర్వహించే వేళల్లో వేదమంత్రాలు స్థానికులందరికీ వినిపించేలా మైకులు, డీజే బాక్సులు, భారీ స్పీకర్లు ఏర్పాటు చేస్తుంటారు. డీజేలకు అనుమతి లేదు. స్పీకర్లు, మైకు ఏర్పాటుకు ఎస్ఐ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలి. రోజంతా భక్తి గీతాలు మోగించడంతో చిన్నారులు, వృద్ధులు, విద్యార్థులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉంది. పూజ జరిగే సమయంలో తక్కువ శబ్దంతో మైకులు వాడాలి.

మద్యం వద్దు..

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శోభాయాత్రలో యువత మద్యం మత్తులో జోగుతూ నృత్యాలు చేస్తుంటారు. విగ్రహ ప్రతిష్ట రోజు నుంచి నిమజ్జనం వరకు మద్యం తాగకుండా భక్తులు వేడుకల్లో పాల్గొనాలి. శోభయాత్రలో విద్యుత్ తీగలను పరిశీలిస్తూ అప్రమత్తంగా వాహనం ముందుకు సాగాలి.

అనధికార కనెక్షన్లు వద్దు..

మండపాలకు విద్యుత్ కనెక్షన్లు అనధికారికంగా తీసుకోవద్దు. అధికారిక కనెక్షన్లు అయితే విద్యుత్ సిబ్బంది వచ్చి పరిశీలించి వైరింగ్ సక్రమంగా ఉండేలా చేస్తారు. విద్యుత్ తీగల కింద మండపాలు ఏర్పాటు చేయొద్దు. మండపంలో ప్రతిష్టించేటప్పుడు చుట్టుపక్కల పైభాగాల్లో పరిశీలించాలి.

రద్దీ వేళల్లో చాలా జాగ్రత్త

సామూహిక వేడుకలు, మండపాల వద్ద భక్తులు గణనాథుని దర్శనానికి బారులుతీరుతారు. రద్దీ ప్రాంతాలలో చోరీలు జరిగే అవకాశాలుంటాయి. అప్రమత్తంగా ఉండాలి. మండపాల అలంకరణ, నిమజ్జనం రోజు అధికంగా ఖర్చు చేయడం కంటే అన్నదానాలు, పిల్లలకు విజ్ఞాన, వినోద కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

జాగ్రత్తలు..

- వినాయకుడి మండపాలను నిర్మించే సమయంలో సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలి.
- రహదారి మధ్యలో మండపాలు నిర్మిస్తే వాహనాల రాకపోకలు, ఇతరాత్ర ఇబ్బందులెదురవుతాయి.
- రోడ్డు పక్కన, ఖాళీ స్థలంలో ఏర్పాటు చేయాలి.

అప్రమత్తత అవసరం..

- మండపాలను నాణ్యమైన వస్తువులతో నిర్మించుకోవాలి.
- సత్ప్రవర్తన కలిగిన సభ్యులను నియమించుకుని భక్తులను క్రమబద్ధీకరించేలా చూసుకోవాలి.
- మండపాల వద్ద టపాసులు, ఇతర మందుగుండు సామగ్రి ఉంచొద్దు.
- 24 గంటలు సభ్యులు ఉండాలి.
- ఒక డ్రమ్‌లో నీరు, రెండు బకెట్లలో ఇసుక నింపి ఉంచుకోవాలి.
- శాంతి కమిటీ సమావేశంలో పోలీసులు, అధికారులు సూచించే అంశాలను పాటించాలి.
- నిమజ్జనం రోజు చెరువుల్లో గుంతలు ఉంటాయి.
- నది, కాలువల్లో నీటి ప్రవాహం ఉంటుంది. – చాలా జాగ్రత్తలు తీసుకోవాలి.

వినాయక మండపాలు సిద్ధం



పచ్చర్లలో మండపం సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

రాజోళి: వినాయ చవితి పండుగను పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామా ల్లో మండపాలు సిద్ధమయ్యాయి. రాజోళితో పాటు పచ్చర్ల, మాన్‌దొడ్డి ఆయా గ్రామాల్లో యువకులు, వినాయక ఉత్సవాల నిర్వాహకులు మండపాలను ముస్తాబు చేశారు.

రాచరిక పాలన నుంచి విముక్తి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్: రాచరిక పాలన నుంచి తెలంగాణ ప్రాంతం విముక్తి పొంది స్వేచ్ఛాయుత వాతావరణం ఏర్పడిన రోజే సెప్టెంబర్ 17 అని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకలను అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాచరిక పాలన విముక్తి కోసం పోరాడిన అమరులను స్మరించుకుంటూ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆనాటి అద్భుత ఘట్టాలు జాతి జనుల జ్ఞాపకాల్లో నిత్యం ప్రకాశిస్తూనే ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బీసమ్మ, వైస్ ఎంపీపీ దేవన్న, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లోకేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రమణ, నరసింహ, తిమ్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.